ఎస్వీయూలో జాబ్ మేళా రేపు

తిరుపతి సిటీ : ఎస్వీ యూనివర్సిటీ మోడల్ కెరీర్ సెంటర్‌లో ఈ నెల 4వ తేదీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ టి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. సీఎంఆర్ జ్యువెలరీ, గంగోత్రి ట్రేడర్స్, అపోలో ఫార్మసీ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు జాబ్ మేళాలో పాల్గొంటారని పేర్కొన్నారు. మార్కెటింగ్, ఎలక్ట్రిషియన్స్, డ్రైవర్స్, హెల్పర్స్, ఫార్మసిస్ట్స్ వంటి ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు హాజరు కావచ్చని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిఫార్మసీ, బీఫార్మసీ, ఎంఫార్మసీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలియజేశారు. ఆసక్తిగల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో శుక్రవారం ఉదయం 10గంటలకు వర్సిటీలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయానికి హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7989810194 నంబర్‌లో సంప్రదించవచ్చని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

దూర విద్య డిగ్రీ ఫలితాల విడుదల

తిరుపతి సిటీ : ఎస్వీ యూని వర్సిటీ దూరవిద్య కేంద్రం(డీడీఈ) పరిధిలో ఈ ఏడాది ఏప్రెల్‌లో నిర్వహించిన డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ) తృతీయ సంవత్సరం ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ పరీక్షల విభాగ నియంత్రణ అధికారి దామ్లా నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు డీడీఈ వెబ్‌సైట్‌ను గాను www.manabadi.co.in వెబ్‌సైట్‌ను వీక్షించి ఫలితాలను తెలుసుకోవచ్చని సూచించారు.

ఇక పంచాయతీల్లో డిజిటల్ చెల్లింపులు

నగదు రూపంలో పన్నుల వసూళ్లకు గ్రామ పంచాయతీలు ఇకపై గుడ్‌బై చెప్పనున్నాయి. కేవలం డిజిటల్ చెల్లింపులు మాత్రమే అంగీకరించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఆదేశించింది. దీంతో ఆగస్టు 15వ తేదీనుంచి మొబైల్ ద్వారా క్యూఆర్ కోడ్‌తో నగదు చెల్లించే ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆ మేరకు పంచాయతీల్లో నగదు చెల్లింపులకు పూర్తిగా స్వస్తి పలకనున్నారు. డిజిటల్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీనికోసం ఆగస్టు 1వ తేదీ నుంచే అవగాహన కల్పించనున్నారు.

- ఆగస్టు 15 నుంచి అమల్లోకి
- అవినీతికి చెక్‌పెట్టేందుకే ప్రభుత్వ నిర్ణయం
- ఏటా ఇంటి పన్నులు రూ.31.35 కోట్లు



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం డిజిటల్ సేవల పోస్టర్

జిల్లా పంచాయతీ పన్నుల సమాచారం		
ఏటా ఇంటి పన్నులు	-	రూ.31.35 కోట్లు
ఇతర పన్నులు	-	రూ.9.06 కోట్లు
పంచాయతీల సంఖ్య	-	774
కుటుంబాల సంఖ్య	-	2,05,436
జనాభా	-	10,08,199
మహిళలు	-	5,06,350
పురుషులు	-	5,01699
ఇతరులు	-	150

తిరుపతి అర్బన్: జిల్లాలోని గ్రామ పంచాయతీల ద్వారా సేవలు పొందే లబ్ధిదారులు నిర్ణీత మొత్తంలో చెల్లించాల్సిన రుసుముతో పాటు ఇంటి పన్నులు సైతం డిజిటల్ ఆధారిత రూపంలోనే చెల్లించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రతీ గ్రామ పంచాయతీ అధికారిక బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను అనుసంధానం చేసుకోవాలి. అంతేకాకుండా వివిధ రకాల డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లింపులు జరిపేలా ప్రత్యేక పరికరాలను అన్ని పంచాయతీలకు సమకూర్చనున్నారు. పంచాయతీల్లో నిధుల వినియోగంలో పారదర్శకతకు వీలుగా ప్రభుత్వం డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించాలని నిర్ణయించింది.

అవినీతికి ఇక అవకాశం లేదు

గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుల తోపాటు లైబ్రరీ పన్ను, స్టోర్స్ పన్ను, లైటింగ్ పన్ను, డ్రైనేజీ పన్నులు, నీటి పన్నులు, ఫైర్ పన్నులు ఏటా 2,05,436 కుటుంబాల నుంచి రూ.31,35,24,975 వసూలు చేయాల్సి ఉంది. అంతేకాకుండా వ్యాపారానికి చెందిన ఇతర పన్నులు ఏటా రూ.9,06,37,203 వసూలు చేయాలి. వీరంతా ఆగస్టు 15వ తేదీ నుంచి డిజిటల్ రూపంలోనే చెల్లించాలి. గతంలో పలువురు పంచాయతీ సిబ్బంది పన్నులు వసూలు చేసి సొంత అవసరాలకు వాడుకున్నారనే విమర్శలు వినిపించాయి. ఎప్పుడో జిల్లా అధికారులు తనిఖీలు చేసిన సమయంలో అవి బయటపడేవి. ఆ సమయంలో నీళ్లు నమిలేవారు. తప్పనిసరి పరిస్థితులో రికవరీ చేసేవారు. తనిఖీలు చేయకుంటే జేబుల్లోకి వెళ్లిపోయేవి. అలాంటి పరిస్థితులకు తావులేకుండా ప్రభుత్వం నగదు వసూళ్లకు చెక్‌పెట్టింది. అంతా డిజిటల్ పద్ధతిలోనే నిర్వహించనుంది.

డిజిటల్ చెల్లింపులతో స్పష్టత



మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో డిజిటల్ చెల్లింపులకు శ్రీకారం చుట్టనుంది. దీంతో పన్నుల విషయంలో స్పష్టత ఉంటుందని భావిస్తున్నాం. పంచాయితీ సిబ్బందికి నగదు ఇవ్వడం ద్వారా అక్రమాలకు అవకాశం ఉండేది. ఇకపై అలాంటి తలనొప్పులకు తావులేకుండా క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించడం సౌకర్యంగా ఉంటుందని భావిస్తున్నాం. **- మునికుమార్, పల్లం పంచాయతీ, ఏర్పేడు మండలం**

స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం



ఆగస్టు 15 తర్వాత ఏ ఒక్క పంచాయతీలోను నగదు తీసుకోరాదని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశాం. ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో డిజిటల్ పేమెంట్ల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పంచాయతీ ఖాతాలు ఉన్న బ్యాంక్‌ల నుంచి క్యూఆర్ కోడ్‌లను తీసుకుంటున్నారు. ముందుగా డిజిటల్ చెల్లింపులపై గ్రామాల్లో ఆగస్టు 1వ తేదీనుంచి పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నాం. **- రాజశేఖర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి, తిరుపతి**

ఆటో బోల్తా.. డ్రైవర్ మృతి

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని పదోమైలు వద్ద కేటీ రోడ్డుపై మంగళవారం రాత్రి ఆటో బోల్తా పడడంతో డ్రైవర్ మృతి చెందాడు. వివరాలు.. తొట్టంబేడు మండలం అంజూరు గ్రామానికి చెందిన సురేష్ (34) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలోవరదయ్యపాళెం మండలంలోని సీసీఎల్ ఫ్యాక్టరీకి అంజూరు నుంచి కూలీలను తీసుకెళ్లాడు. తిరుగుప్రయాణంలో ఉండగా ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన సురేష్ అక్కడికక్కడే మరణించాడు. ఎస్ఐ మంజునాథరెడ్డి ఘటనాస్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

పాకాల: మండలంలోని ముద్దలపల్లె సమీపంలో బుధవారం రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. పాకాలలోని ధర్మరాజులగుడివీధికి చెందిన మణిమారన్(24) కోయంబత్తూరు నుంచి తిరుపతికి వస్తున్న రైలు కిందపడి బలవన్మరణం చెందాడు. రైల్వే పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

తల్లీబిడ్డల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం





సైదాపురం: కిట్‌ను అందజేస్తున్న నేదురుమల్లి, గూడూరురూరల్: గర్భిణులకు సారె అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, సూళ్లూరుపేట రూరల్: కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సైదాపురం: తల్లీబిడ్డల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్‌జగన్‌మోహర్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కమ్మవారిపల్లి ఎస్టీ కాలనీలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈకార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ రవికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు పోలయ్య, సర్పంచ్ శారద, సీడీపీఓ సునంద, సూపర్‌వైజర్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

గూడూరురూరల్: పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు తెలిపారు. బుధవారం గూడూరులోని సీతమ్మబడి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్‌ల పంపిణీ చేశారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించి సారెను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కే మీరారెడ్డి, రాష్ట్ర శిశు సంక్షేమ శాఖ చైర్‌పర్సన్ కే కల్పలత, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బీ శ్రీనివాసులు, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు నరసయ్య, మల్లాం శేషురెడ్డి, ఏ మురళి, మైనార్టీ నాయకులు సుభాన్, అల్తాఫ్, జీనత్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమ పథకాలు

సూళ్లూరుపేట రూరల్: అందరికీ సంక్షేమ పథకాలు అందేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టి సారించారని ఇందులో వైఎస్సార్ సంపూర్ణ పోషణ ఒకటని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మంగళంపాడులో గర్భిణులకు బుధవారం పోషకాహారకిట్లను అందజేశారు. ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి, నాయకులు జే వేణు, ఎం.రామకృష్ణ, వీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.





రాపూరు: కిట్లను అందజేస్తున్న ఎంపీడీఓ అప్పాజీ, తహసీల్దార్ ప్రసాద్, చిల్లకూరు: టీహెచ్‌ఆర్ పంపిణీ చేస్తున్న వైద్యులు భావనారాయణ, వెంకటగిరి రూరల్: కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ పద్మావతి తదితరులు

మహిళలకు అండగా ప్రభుత్వం

వెంకటగిరి: మహిళలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్ భానుప్రియ, నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ డీ శారద అన్నారు. పట్టణంలోని 14, 15 వార్డుల సచివాలయంలో వారు బుధవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు ఎస్ బాలయ్య, సీహెచ్ ఉమామహేశ్వరి, మున్సిపల్ విప్ పీ లక్ష్మి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, మహిళావిభాగం అధ్యక్షురాలు డీ రాధమ్మ, కౌన్సిలర్ ఏ శంకరయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు కే వెంకటరత్నంరాజు, కౌన్సిలర్లు ఏ శ్రీనివాసులురెడ్డి, కే కళ్యాణి, వహీదా, ఎంఏ నారాయణ, ఎస్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

డక్కిలి: ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీపీ జీ రాజశేఖర్ తెలిపారు. డక్కిలి ఎస్టీ కాలనీ అంగనవాడీ కేంద్రంలో బుధవారం వైఎస్సార్ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ వెంకటగిరి సీడీపీఓ శంషాద్‌బేగం, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, సూపర్‌వైజర్ కల్పలత పాల్గొన్నారు.

టీహెచ్‌ఆర్‌లో పోషకాహారం

చిల్లకూరు: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేసే టేక్ హోం రేషన్‌లో పోషకాహార విలువలు కలిగిన వస్తువులు ఉన్నాయని చిల్లకూరు వైద్యులు భావనారాయణ అన్నారు. చిల్లకూరులోని ఆరు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు బుధవారం టేక్ హోం రేషన్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్ రేణుక, సర్పంచ్ పీ కోటమ్మ, హెచ్‌ఎం గురవయ్య, హెల్త్ సూపర్‌వైజర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

రాపూరు: గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అప్పాజీ పేర్కొన్నారు. రాపూరులో బుధవారం నిర్వహించిన టేక్‌హోం రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ ప్రసాద్‌తో కలసి ప్రారంభించారు. సీడీపీఓ సునంద, సూపర్‌వైజర్ శారద పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యం

పెళ్లకూరు: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా పేర్కొన్నారు. బుధవారం పెళ్లకూరు అంగన్‌వాడీ కేంద్రంలో స్థానిక సర్పంచ్ టీ వాణి అధ్యక్షతన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. ఎంపీడీఓ సురేషబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాయిలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

వెంకటగిరిరూరల్: ప్రజా ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని బుసపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం వైఎస్సార్ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పద్మావతి, ఎంపీటీసీ సభ్యురాలు వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి పెద్దపీట

నాయుడుపేటటౌన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం దీపిక అన్నారు. పట్టణంలోని ఏల్ఏ సాగరం అగ్రహారపేట అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కే జయరామయ్య, డీ రవి, కే అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





వెంకటగిరి: గర్భిణీలకు సీమంతం చేస్తున్న ప్రజాప్రతినిధులు, పెళ్లకూరు: మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు ప్రిస్కిల్లా, నాయుడుపేటటౌన్: కిట్‌లను పంపిణీ చేసిన చైర్ పర్సన్ దీపిక, సీడీపీఓ

క్రికెట్ టోర్నీలో చిత్తూరు, కర్నూలు జయకేతనం

వెంకటగిరి : పట్టణంలోని తారకరామా క్రీడాప్రాంగణంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సౌత్‌జోన్ సీనియర్ మహిళల క్రికెట్ పోటీల్లో చిత్తూరు, కర్నూలు జట్లు విజేతలుగా నిలిచాయి. బుధవారం తొలుత గ్రౌండ్-1లో నెల్లూరు- చిత్తూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 24.3 ఓవర్లకు 3 వికెట్లు నష్టపోయి 147 పరుగులు చేసి గెలుపొందింది. గ్రౌండ్-2లో అనంతపురం- కర్నూలు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో అనంతపురం జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. 36 ఓవర్లలో 99 పరుగుకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 20.1 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 103 పరుగులు చేసి అలవోకగా విజయం సాధించింది.


క్రీడాకారిణి శరణ్య

జిల్లాకు చేరిన ట్రాన్స్‌ఫార్మర్లు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ట్రాన్స్‌ఫార్మర్‌లు వచ్చాయని ట్రాన్స్‌కో టెక్నికల్ ఈఈ సుబ్బారావ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 16కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 40, 315 సామర్థ్యంతో 4, 63 కేవీ 21 వచ్చాయని వెల్లడించారు. సంబంధిత ఏఈలు వర్క్‌ఆర్డర్‌లు పెట్టి మెటీరియల్‌ను డ్రా చేసుకోవాలని సూచించారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ.39,550 నగదు, బైక్ స్వాధీనం

తిరుపతి రూరల్: ఆలయాల్లో చోరీలకు పాల్పడిన అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేసి రూ.39,550 నగదు, మోటార్ సైకిల్ను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ సుబ్రమణ్యం రెడ్డి, ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ తమిళనాడులోని నాగర్‌కోయిల్ జిల్లా కన్యాకుమారికి చెందిన ఉమేష్ ధీరజ్, అతడి తండ్రి ఉమేష్ పలు ఆలయాల్లో చోరీలకు పాల్పడినట్లు వెల్లడించారు. అందులో భాగంగా జూలై 11వ తేదీ అర్ధరాత్రి తిరుపతి రూరల్ మండలం కొత్త చెర్లోపల్లెలోని ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ చేసినట్లు చెప్పారు. హుండీని పగలకొట్టి రూ.57 వేల నగదు, సీసీ కెమెరాలకు సంబంధించిన డీవీఆర్ బాక్స్‌ను అపహరించినట్లు వివరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా బుధవారం కాలూరు క్రాస్ వద్ద ఉమేష్ ధీరజ్ పట్టుబడినట్లు వెల్లడించారు. మరో నిందితుడు ఉమేష్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ వినోద్‌కుమార్, సిబ్బందిని ఎస్పీ పరమేశ్వర రెడ్డి అభినందించారు.


నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

క్లుప్తంగా

జగనన్న సురక్షలో 10,506 మందికి సేవలు

కోట: జగనన్న సురక్ష కార్యక్రమంలో కోట మండలంలో 10,506 మందికి సేవలు అందించినట్లు ఎంపీడీఓ భవానీ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ మాట్లాడుతూ గత జూన్ 24వ తేదీ నుంచి వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టారన్నారు. జూలై 1 నుంచి 31వ తేదీ వరకు మండలంలోని 16 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించామన్నారు. 11 అంశాలకు సంబంధించి మొత్తం 10,506 మందికి సేవలు అందించి ధ్రువపత్రాలు జారీ చేశామన్నారు.

గర్భిణులకు సీమంతాలు


సామూహిక సీమంతం చేస్తున్న సిబ్బంది

చిల్లకూరు: మండలంలోని లింగవరం, ఏరూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం సామూహిక సీమంతం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ నాశిన సుబ్రహ్మణ్యం పాల్గొని, గర్భిణులను ఆశీర్వదించారు. అనంతరం గర్భిణులకు పసుపు కుంకుమ, పూలు, జాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో బాలాజీ, పంచాయతీ కార్యదర్శి మాధవి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

పెళ్లకూరు: ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం ఈ నెల 21వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రామయ్య చేతులు మీదుగా ఆవిష్కరించారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది భాస్కర్‌రావు, శ్రావణ్ పాల్గొన్నారు.

విద్యాదీవెన అమలులో జాప్యం వద్దు

నాయుడుపేట: వసతి గృహ విద్యార్థుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యా దీవెన పథకం అమలులో జాప్యం చేయవద్దని సాంఘిక సంక్షేమ శాఖ తిరుపతి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్య సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో బుధవారం సూళ్లూరుపేట, నాయుడుపేట, తడ, దొరవారిసత్రం, చిట్టమూరు మండలాల్లోని హాస్టల్ వార్డెన్లు, విద్యా సహాయకులు, వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఏఎస్‌డబ్ల్యూ సుధ, సుకుమార్ పాల్గొన్నారు.

'ఆజాదికా అమృత్' విజయవంతం చేయండి


మాట్లాడుతున్న ఏపీడీ వరప్రసాద్

దక్కిలి: ఆజాదికా అమృత్ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఉపాధిహామీ పథకం ఏపీడీ వరప్రసాద్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఈ కార్యక్రమం నిర్వహణపై పంచాయతీ కారదర్శులతో సమావేశం నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 25వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలు గ్రామస్థాయిలో నిర్వహించాలన్నారు. గ్రామస్థాయిలో మట్టిని సేకరించి ఢిల్లీకి పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

హాజరుశాతం పెంచండి

కోట: విద్యార్థుల హాజరుశాతం పెంచాలని ఎంఈఓ మస్తానయ్య ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం చెందోడు ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ తనిఖీ చేశారు. విద్యాకానుక కిట్లు అందరికీ అందాయా?లేదాని పరిశీలించారు. హాజరు రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. డ్రాపౌట్ల తల్లిదండ్రులతో చర్చించి, బడి మానిన పిల్లలను రప్పించాలన్నారు.

విగ్రహప్రతిష్టకు ఆర్థికసాయం

వెంకటగిరి: పట్టణంలోని ఏపీ మోడల్‌స్కూల్‌లో స్వాతంత్య్ర సమరయోధుల విగ్రహ ప్రతిష్టకు దాతలు ఆర్థికసాయం అందజేశారు. ఎన్‌వీఆర్ ట్రస్టు ఛైర్మన్ ఎన్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థికసాయాన్ని ఎడ్యుకేషనల్ సర్వీస్ సొసైటీ(ఈఎస్‌ఎస్) మాజీ అధ్యక్షుడు ఎల్ మురళీకృష్ణ ద్వారా పాఠశాల ప్రిన్స్‌పల్ డి తులసిజ్యోతికి ఈ మొత్తాన్ని బుధవారం అందజేశారు.

పేదల మంచికే యాత్ర

ఓజిలి: పేదలకు మంచి చేయాలన్న ఉద్దేశంతో ఐక్యతా విజయపథం యాత్ర చేస్తున్నట్లు మాజీ ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ అన్నారు. ఓజిలి గ్రామం నుంచి బత్తాలాపురం, మానమాల గ్రామాల మీదుగా కురుగొండ గ్రామం వరకు బుధవారం ఐక్యతా విజయపథం యాత్ర కార్యక్రమం నిర్వహించారు. దారి పొడవున గ్రామాల్లోని ప్రజలు ఈ సందర్భంగా విజయ్‌కుమార్‌కు ఘనస్వాగతం పలికి పూలమాలలు వేసి, శాలువలు కప్పి, సన్మానించారు.

అక్కపాళ గ్రామానికి చెందిన తాతంశెట్టి అమ్ములు మొలకాయలమ్మ పొదుపు గ్రూపు సభ్యురాలు. భార్యభర్తలిద్దరూ వ్యవసాయ పనులకు వెళ్లందే కుటుంబం గడవదు. ఈమెకు రెండేళ్ల కిందట ఆసరా పథకం ద్వారా రూ.15,200 మంజూరు కాగా బ్యాంకు రుణం రూ.70 వేలు మంజూరైంది. ఈ మొత్తంతో గ్రామంలోనే చిల్లర దుకాణం పెట్టుకుంది. ఈ వ్యాపారంలో రోజుకు రూ.500పైన ఆదాయం వస్తోంది. దీంతో కుటుంబ ఆదాయం పెరిగి, సంతోషంగా జీవిస్తోంది.



వీఎస్ఆర్ నగర్ కాలనీకి చెందిన మాదర పాక రమణి మహాలక్ష్మి గ్రూపు సభ్యురాలు. ఈమె భర్త ఆటో నడిపందే జీవనం సాగదు. ఈమె తన ఇద్దరు కుమార్తెలను చదివించడానికి ఇబ్బందులు పడ్డారు. ఆ తరుణంలో వైఎస్సార్ ఆసరాలో రమణికి రూ.12,500 మంజూరు కాగా బ్యాంకు రుణం మరో రూ.10 వేలు మంజూరైంది. ఈ మొత్తంతో పిండిమర యంత్రం కొనుగోలు చేసి, ఇంటి వద్దనే పెట్టుకుంది. రోజు రూ.400 వరకు వ్యాపారం జరుగుతుంది. దీంతో ఆమె ఆర్థికంగా నిలదొక్కుకుంది.



అతివకు అండ

- పథకాలతో ఆర్థిక సాయం
- సున్నావడ్డీ రుణాలు
- చిరువ్యాపారాలతో ఆర్థికాభివృద్ధి

మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేసేలా ప్రభుత్వం వారిని ప్రోత్సహిస్తోంది. డ్వాక్రా సంఘాల సభ్యులకు ఇప్పటికే ఆసరా, చేయూత, వడ్డీలేని రుణాలు తదితర పథకాలు అందిస్తోంది. ఫలితంగా వారు చిరు వ్యాపారాలు ప్రారంభించి, ఆనందంగా జీవిస్తున్నారు.


అక్కరపాకలో సమావేశమైన పొదుపు సంఘం సభ్యులు

దొరవారిసత్రం: రాష్ట్రంలో అమలవుతున్న పథకాలతో డ్వాక్రా మహిళలు చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుని, ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. ఫలితంగా వారి కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నాయి. గత టీడీపీ పాలనలో డ్వాక్రా సంఘాలకు ఎలాంటి చేయూతనివ్వకపోగా అతివలకు అన్యాయం చేశారు. దీంతో వందల సంఖ్యలో సంఘాలు అర్థాంతరంగా ఆగిపోయాయి. ఆగిపోయిన డ్వాక్రా గ్రూపులు సైతం ముందుకు నడిచేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు చొరవ తీసుకుంది. ప్రతి సంఘానికి ప్రభుత్వం చేయూత నిచ్చి, అతివలకు అండగా నిలిచింది.

పెరిగిన డ్వాక్రా సంఘాలు

టీడీపీ పాలనలో డ్వాక్రా గ్రూపులు 741 ఉండగా 7,546 సభ్యులు ఉన్నారు. ఆ సమయంలో 150 గ్రూపులు వరకు ఆగిపోయాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత ఆగిపోయిన డ్వాక్రా గ్రూపులన్నీ సక్రమంగా నడిచేలా చర్యలు చేపట్టారు. దీంతో ప్రసుత్తం 952 గ్రూపుల్లో 9,826 మంది సభ్యులు ఉన్నారు.

పథకాలతో రూ.కోట్లలో లబ్ధి

సంఘాలకు సున్నా వడ్డీ కింద 2019–20 ఏడాది 812 గ్రూపులకు రూ.98 లక్షలు, 2020–21 ఏడాది 815 గ్రూపులకు రూ.116 లక్షలు, 2021–22 ఏడాది 825 గ్రూపులకు రూ.97.64 లక్షలు అందజేశారు. అలాగే వైఎస్సార్ ఆసరా కింద 582 సంఘాల్లోని 6,011 మంది సభ్యులకు వరుసగా 2019–20 నుంచి 2021–22 వరకు రూ. 44,337,431 చొప్పున మూడు విడతల్లో ఆసరా చెక్కులు అందజేశారు. డ్వాక్రా గ్రూపులకు బ్యాంకు లింకేజీ కింద 2019–20లో రూ. 12 కోట్లు, 2020–21లో రూ.18 కోట్లు, 2021–22లో రూ.19 కోట్లు, 2022–23లో ఇప్పటివరకు రూ.4.55 కోట్లు రుణాలు అందించారు. గత నాలుగేళ్లలో 725 మంది చిరువ్యాపారులకు పదివేలు చొప్పున వడ్డీ లేని రుణాలు అందజేశారు. పెరటి కోళ్ల పెంపకం పథకం కింద పొదుపు గ్రూపు సభ్యులకు ఒక్కొక్క యూనిట్(11కోళ్లు) రూ.3150 చొప్పున మూడేళ్లలో 150 యూనిట్లు అందజేశారు.

చిరువ్యాపారాలతో ఆర్థికాభివృద్ధి

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత డ్వాక్రా గ్రూపుల సభ్యుల కోసం అమలు చేసిన పలు పథకాలతో వారు ఆర్థికాభివృద్ధి సాధించారు. వారి కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. ప్రభుత్వం సంఘాలను ప్రోత్సహించడంతో ఆగిపోయిన సంఘాలు సైతం సజావుగా సాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కొత్త డ్వాక్రా సంఘాలు ప్రారంభమయ్యాయి.

పథకాలతో ఎంతో ఉపయోగం



"డ్వాక్రా సంఘాలకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు, బ్యాంక్ లింకేజీ రుణాలు వారికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి.ప్రతి పథకం సకాలంలో సంఘాలకు అందడంతో మహిళలు ఉత్సాహంగా అన్ని కార్యకలపాల్లో పాల్గొంటున్నారు. గతంలో రుణ బకాయిల చెల్లింపు సమస్య ఉండేది. ఇప్పుడా సమస్య లేదు.

–ఎస్ పద్మావతి, ఏపీఎం, డీవీ సత్రం

ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతోనే..


మహనీయుల విగ్రహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరురూరల్: పట్టణ ప్రజలకు తమవంతు సేవ చేయాలనే సంకల్పంతోనే గూడూరులో కుటుంబ సభ్యుల సహకారంతో సొంత నిధులు వెచ్చించి పలు కార్యక్రమాలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే తన కుమారుడు వెలగపల్లి నవీన్‌గుప్త, కోడలు ప్రీతి, కుటుంబ సభ్యులతో కలసి పట్టణంలో చేపడుతున్న నూతన టవర్‌క్లాక్ నిర్మాణం, జ్యోతిరావు పూలే, సావిత్రీభాయి పూలే, బాబూ జగజ్జీవన్‌రామ్, మౌలానా అబుల్ కలాం ఆజాద్, మథర్ థెరిస్సా విగ్రహాల పనులను పరిశీలించారు. నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేసి త్వరలోనే ప్రజలకు అంకితం చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బీ శ్రీనివాసులు, ఎం సతీష్‌రెడ్డి, సుబాన్, జనార్దన్, అల్తాఫ్, భాస్కర్‌గౌడ్, నరసయ్య తదితరులు ఉన్నారు.

అనీష్‌డ్యానీకి మంత్రి రోజా అభినందన


మంత్రి రోజాతో క్రీడాకారుడు అనీష్ డ్యానీ

నాయుడుపేటటౌన్: బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో జాతీయ, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నాయుడుపేటకు చెందిన క్రీడాకారుడు అనీష్‌డ్యానీని బుధవారం రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా అభినందించారు. క్రీడాకారుడి కుటుంబసభ్యులతో పాటు స్థానిక వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి ఈ రత్నశ్రీ నగరిలోని మంత్రి నివాసంలో ఆర్కే రోజాను కలిశారు. ఈ సందర్భంగా రోజాకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువ కప్పి సత్కారించారు. గత నెలలో నెల్లూరులో జరిగిన అండర్–17 రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు సింగిల్స్ విభాగంలో అనీష్ డ్యానీ విజయం సాధించాడు. అలాగే 2022లో జాతీయస్థాయిలో థాయిలాండ్‌లో అండర్–15 పోటీల్లో పాల్గొని రన్నర్‌గా నిలిచాడు. దీంతో అనీష్ డ్యానీ క్రీడా ప్రతిభను తెలుసుకుని మంత్రి అభినందించారు. మంత్రిని కలిసిన వారిలో అరుణమ్మ, జయరామయ్య, వీరాస్వామి, తదితరులు ఉన్నారు.

95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి


నాయుడుపేటలో దివ్యాంగునికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్


నెల్లూరు వైద్యశాలకు వెళ్లి జయమ్మకు పింఛన్ పంపిణీ చేసిన వెల్ఫేర్ కార్యదర్శి కిషోర్

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీలో బుధవారం నాటికి 95 శాతం వరకు పింఛన్‌లను పంపిణీ చేసినట్లు కమిషనర్ ఐ శ్రీనివాసరావు తెలిపారు. 13 సచివాలయాల పరిధిలోని 25 వార్డుల్లో వలంటీర్లు రెండో రోజు తెల్లవారుజాము నుంచే పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

నెల్లూరు వైద్యశాలకు వెళ్లి పింఛన్ అందజేత

నెల్లూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధురాలికి వెల్ఫేర్ అసిస్టెంట్ నాయుడుపేట నుంచి అక్కడికి వెళ్లి పింఛన్ అందజేశాడు. పట్టణంలోని లోతువానిగుంట వీధి చెందిన కొండూరు జయమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో నెల్లూరు నారాయణ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న లోతువానిగుంట సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి కిషోర్ బుధవారం నెల్లూరు వైద్యశాల వద్దకు వెళ్లి జయమ్మకు పింఛన్ అందజేశాడు.

పింఛన్ల పంపిణీ 95.64 శాతం పూర్తి

దొరవారిసత్రం: మండలంలోని 4,816 మంది పింఛన్‌దారులకుగాను బుధవారం నాటికి 4,606 మంది లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్ నగదు అందజేశారని, దీంతో 95.64 శాతం పంపిణీ పూర్తి చేశామని ఎంపీడీఓ సింగయ్య తెలిపారు. మిగిలిన లబ్ధిదారులకు కూడా అందజేసేందుకు సచివాలయం సిబ్బంది అన్ని చర్యలు చేపట్టారన్నారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన పింఛన్‌దారుడు నేలవల్లి మునినాయుడు అనారోగ్యంతో నెల్లూరులో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో సంబంధిత వలంటీర్ హారిక నెల్లూరుకు వెళ్లి పింఛన్ అందజేసింది.

సెప్టెంబర్ 8న మెగా జాబ్‌మేళా

సైదాపురం: వెంకటగిరి పట్టణంలో వచ్చే సెప్టెంబర్ 8 తేదీన వెంకటగిరిలో మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

చట్టబద్ధత కల్పించాలి

ఓజిలి: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కే మల్లిరవి మాదిగ అన్నారు. మాదిగల విశ్వరూపమహాసభ విజయవంతం చేసేందుకు మండలంలో వజ్జావారి పాళెంలో బుధవారం నియోజకవర్గ నాయకులు ప్రచారం చేశారు. సమితి తిరుపతి జిల్లా ఇన్‌చార్జి పెంచలయ్య మాదిగ, నాయకులు గోవిందు వాసు మాదిగ, వై చిన్నడిల్లెయ్య, మస్తాన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


భూ సమస్యలు పరిష్కరించండి

వాకాడు: మండలంలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించాలని ఆర్డీఓ కిరణ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వివిధ భూ సమస్యలపై రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. వాకాడు మండలంలో నెలకొన్న భూ సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న లేఅవుట్‌లో గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు అవసరమైన ఇసుకను సకాలంలో అందించాలన్నారు. తహసీల్దార్ నరసింహారావు, డిటీ సారంగపాణి పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ' జయప్రదం చేయండి

నాయుడుపేటటౌన్: రైల్వే ఉద్యోగులు, కార్మికులు డిమాండ్‌ల సాధన లక్ష్యంగా సదరన్ రైల్వే మజ్దూర్ యూనియన్ పిలుపు మేరకు ఈ నెల 10 తేదీన చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో సూళ్లూరుపేట డివిజన్ పరిధిలోని ఎస్ఆర్ఎంయూ నాయకులు బుధవారం సమావేశమయ్యారు. ఆ సంఘ డివిజన్ కార్యదర్శి చెంచురత్నం మాట్లాడుతూ ఉద్యోగులకు పాత పింఛన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఆర్ఎంయూ నాయకులు చిరంజీవి, పోలయ్య, కిరణ్ కుమార్, చక్రి, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి


రికార్డులు తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఈఓ

దక్కిలి: ఏపీ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 2023–24లో పదో తరగతి చదివే విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని గూడూరు డిప్యూటీ డీఈఓ శివప్రకాష్ రెడ్డి తెలిపారు. స్థానిక గురుకుల పాఠశాలను బుధవారం సందర్శించారు. పలు రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని సూచించారు. అనంతరం ఎంఈఓ కార్యాలయాన్ని సందర్శించారు. డ్రాప్‌అవుట్లు లేకుండా చూడాలని ఎంఈఓలకు సూచించారు. ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేస్తోందని, ప్రతి విద్యార్థీ ప్రభుత్వ పాఠశాలలో చదువుకునేలా ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట ఎంఈఓలు వెంకటేశ్వర్లు, జగదీష్, గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి ఉన్నారు.

వైద్య సేవల్లోనూ వారే కీలకం

వలంటీర్లకు వందనం

చిల్లకూరు: ప్రపంచ వ్యాప్తంగా విజృంభించిన కోవిడ్ నివారణ కోసం రెడ్‌క్రాస్ సంస్థ మందులు పంపిణీకి సిద్ధం అయ్యింది. ఆ సమయంలో ఆ సంస్థ నెల్లూరు జిల్లా అధ్యక్షుడిగా ప్రస్తుత ఉపాధ్యాయ ఎమెల్సీ పీ చంద్రశేఖరరెడ్డి తన స్వగ్రామమైన వల్లిపేడులోని గ్రామస్తులకు మందులు అందించేలా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో వలంటీర్‌లు ముందుకు వచ్చి సచివాలయ సిబ్బందితో కలసి ప్రతి కుంటుంబానికీ మందులు అందించి, అండగా నిలిచారు. వల్లివేడుకు చెందిన వలంటీర్ నవీన్, పంచాయతీ కార్యదర్శి రాజా, మహిళా పోలీస్ సుభద్ర కలసి మందులు ఇంటింటికీ వెళ్లి మందులు పంపిణీ చేశారు.


వల్లిపేడులో కోవిడ్ మందులు పంపిణీ చేస్తున్న వలంటీర్, సచివాలయ సిబ్బంది (ఫైల్)

అండగా నిలిచారు



గ్రామంలో కరోనా వచ్చిన సమయంలో వలంటీర్లు ప్రతి కుటుంబానికి అండగా నిలిచారు. గ్రామానికి చెందిన చంద్రశేఖరరెడ్డి మందులు పంపితే ప్రతి వలంటీర్ ఇంటింటికీ వచ్చి మందులు అందించి కరోనా ప్రబలకుండా అడ్డుకట్ట వేశారు. ఆ సమయంలో వారు ప్రతి కుటుంబానికి అండగా నిలిచారు.

–సిద్ధపరెడ్డి మంగయ్య, వల్లిపేడు

వైఎస్సార్ సీపీని ఆదరించండి


నేదురుమల్లికి పూలు చల్లుతూ స్వాగతం పలుకుతున్న మహిళలు

సైదాపురం: అందరి సంక్షేమమే ఊపిరిగా పనిచేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ ఆదరించాలని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కోరారు. సైదాపురం సచివాలయం–2 పరిధిలోని కమ్మవారిపల్లె, వడ్డెర, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. నేదురుమల్లికి పూలు చల్లి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మండలంలోని కమ్మవారిపల్లెలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో నెల్లూరు జిల్లాలో 5.94 లక్షల దరఖాస్తులు అందగా అందులో 5.87 లక్షల మందికి సేవలు అందించి, లబ్ధి చేకూర్చారని చెప్పారు. తిరుపతి జిల్లాలో 92 శాతం సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. జేసీఎస్ కన్వీనర్ రవికుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు శివకుమార్, సర్పంచ్ శారద, జెడ్పీటీసీ సభ్యుడు పోలయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఏ వెంకటయ్య, నేతలు వీ ప్రభాకర్‌రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, మాలకొండారెడ్డి, అబ్బిరాజు, సాంబయ్య పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం

కోట: తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని సీడీపీఓ మునికుమారి అన్నారు. శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పటి నుంచి ఆరునెలల వరకు తల్లిపాలను మాత్రమే తాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ క్రిష్ణమ్మ,వర్కర్లు పెంచలమ్మ,లక్ష్మీ పాల్గొన్నారు.

ముర్రుపాలతోనే మురిపాలు

ఓజిలి: ముర్రుపాలతోనే బిడ్డకు మురిపాలు చిందుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజన అన్నారు. బుధవారం ఓజిలి అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ శిశువు జన్మించిన వెంటనే తల్లిపాలు తాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి హిమజ, సీహెచ్ఓ సుబ్బరామయ్య, ఉపాధ్యాయులు నారాయణ, రవికుమారి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని చూసి ఆశీర్వదించండి


లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల అభ్యున్నతికి పలు సంక్షేమ పథకాలు అమలు చేశారని, ఆ సంక్షేమాన్ని చూసి ప్రజలు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కోరారు. బుధవారం సూళ్లూరుపేట మండలంలోని మంగళంపాడు సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యేకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు గురించి వివరించి, బుక్‌లెట్‌లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు మరో సారి తమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. టీడీపీ నాయకుల మోసపూరిత మాటలు నమ్మవద్దన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు జే వేణు, కౌన్సిలర్ ఎం రామకృష్ణ, టీ ప్రసాద్, వి. సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాబా మందిర వార్షికోత్సవం



ఓజిలి: మండలంలోని మానమాలలో ఉన్న బాబా మందిర 12వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం వేదపండితులు ఎన్ హరికృష్ణశర్మ, అనంతశర్మ, రాములు ఆధ్వర్యంలో బాబాకు పాలు, తేనె, పన్నీరు, పంచామృతంతో అభిషేకాలు చేశారు. అనంతరం కాగడా హారతి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తరువాత సాయివ్రత రుద్రాభిషేకం చేశారు. రాత్రి మందిరంలో బాబాకు పల్లకీసేవ నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో విచారణ


బాలింతతో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రేణుక

చిల్లకూరు: మండలంలోని వల్లిపేడు దళితవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక విచారణ చేపట్టారు. దళితవాడకు చెందిన ఓ మహిళ తనకు కేంద్రం నుంచి సరుకులు అందడం లేదని కాల్ సెంటర్‌కు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ కేంద్రంలో విచారణ చేపట్టి బాలింతను పిలిపించి మాట్లాడారు. గర్భిణిగా ఉన్న సమయంలో కాన్పు కోసం తన పుట్టింటికి వెళ్లగా అక్కడి అంగన్‌వాడీ కేంద్రంలో కూడా తన పేరు నమోదు చేసుకోనందున తనకు సరుకులు అందలేదని, ఇప్పుడు తన అత్తారింటికి వచ్చిన తరువాత ఇక్కడ కూడా పేరు నమోదు చేసుకోకపోవడంతో సరుకులు అందడం లేదన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తతో మాట్లాడి, బాలింత పేరును నమోదు చేయడంతో పాటుగా సరుకులు అందజేశారు. అలాగే అంగన్‌వాడీ కార్యకర్త విధి నిర్వహణలో కూడా అలసత్వం పాటిస్తున్నట్లు గుర్తించామని దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు సూపర్‌వైజర్ తెలిపారు.

బ్యాంకు ఆవరణలో దూసుకెళ్లిన సిలికా లారీ



గోడను ఢీకొని బ్యాంకులోకి వెళ్లిన సిలికా లారీ

చిల్లకూరు: సిలికా లోడ్‌కు వెళుతూ లారీడ్రైవర్ మద్యం మత్తులో రోడ్డు పక్కనే ఉన్న బ్యాంకు ఆవరణలోకి దూసుకెళ్లాడు. ఆ సమయంలో అక్కడ ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు కథనం మేరకు.. మండలంలోని చింతవరం సమీపంలో ఉన్న సిలికా గనుల్లో లోడ్ కోసం బుధవారం సాయంత్రం ఓ లారీని డ్రైవర్ పూటుగా మద్యం తాగి నడిపాడు. లారీ చింతవరం మలుపు వద్దకు వచ్చే సరికే అదుపు తప్పి బ్యాంకు గోడను ఢీకొని, ఆవరణలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానికులు గుర్తించి డ్రైవర్‌ను పట్టుకుని బ్యాంకు మేనేజర్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.